పెద్దకథ:

# మానవత మరణించింది!

— పోటిబండ్ల విజయలక్ష్మి

జరుగుతున్నంతగా పొంగిపోయారు. సమావేశం పూర్తికాగానే చేతులమీద శ్రీహరిని ఎత్తేశారు. ఆనందంగా. ఇంటికి రాగానే పెద్దచెల్లెలు గంగ దిష్టితీసింది. చిన్నచెల్లెలు గ్రీష్మ ఆప్యాయంగా పాయసం నోటికందించింది. తండ్రి గుండెలకు హత్తుకుని ఆనందభాష్పాలు రాల్చారు. తమ్ముడు శ్రీధర్ అన్నయ్య చేతిలోని మెడల్‌నూ, అన్ననూ ముద్దుపెట్టుకొని తన సంతోషాన్ని వ్యక్తపరచాడు. ఆరోజుకోసం ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తూ తన చదువుకోసం అష్టకష్టాలూ పడి, వచ్చే కొద్దిపాటి జీతంతో తమ అవసరాల్ని కుదించుకుంటూ, చివరకి ఆడపిల్లలకు సరైన బట్టలు కూడా కుట్టించ లేని స్థితిలో వున్నా శ్రీహరి చదువు ఆపనివ్వలేదు కృష్ణయ్యగారు.

ఇంట్లో పరిస్థితులు అర్థం చేసుకుని "నేనింక చదవను నాన్నా!'' అన్నరోజు తండ్రి ఎంత బాధ పడ్డాడో తనకింకా గుర్తు. "బాబూ! హరీ! మా రోజుల్లో చదవాలనే కోరిక ఎంతగావున్నా చదివే అవకాశాలులేక, నా చదువు ఇంటర్మీడియట్‌తోనే ముగిసిపోయింది. నువ్వు ఎమ్. ఎ. వరకూ చదవాలి. గొప్ప వుద్యోగస్థుడివి కావాలి. ఆ తర్వాత నీ తమ్ముడి బాధ్యతా, చెల్లెళ్ళ బాధ్యతా నీకు వప్పగించి నేను కృష్ణా రామా అనుకుంటూ ఏ పుణ్యతీర్థాలకో వెళ్ళిపోతాను నాకోరిక తీర్చు బాబూ!'' అంటూ ప్రాధేయపడే తండ్రి కోరిక తీర్చాలన్న ఆవేశం తన అణువణువులో వ్యాపిస్తుంటే....

"అలాగే నాన్నగారూ! తప్పకుండా మీ కోరిక తీరుస్తాను. నా చదువు అయిన మరుక్షణం నుంచే మీరు విశ్రాంతి. తీసుకోండి. ఇంటి బాధ్యత నేను స్వీకరిస్తాను'' అంటూ తండ్రికి ధైర్యం చెప్పాడు.

అనుకున్నట్లుగానే శ్రీహరి యమ్. ఏ. ఫస్ట్ క్లాస్ ఫస్ట్‌గా వచ్చి గోల్డ్‌మెడల్ అందుకున్నాడు.

కానీ....ఆ తర్వాతే అనుకున్నవి అనుకున్నట్లు జరగలేదు. ఈ మూడు సంవత్సరాలుగా శ్రీహరి వుద్యోగం కోసం చేయని ప్రయత్నం లేదు. ఎన్నో యింటర్వ్యూలకు వెళ్ళి వచ్చాడు. అక్కడ మెరిట్ కాదు కావలసింది. సిఫారసు. ఏ మంత్రి గారి దగ్గరనుంచో కావాలి. లేదా వేలకు వేలు లంచాలు పోయగలగాలి. ఆ రెండూ సమీపంలో లేని శ్రీహరికి వుద్యోగం కూడా సుదూర తీరానే వుండి పోయింది.

వుడిగిపోతున్న వయసులో కొడుక్కు వుద్యోగం దొరకలేదన్న బాధతో, కూతురు గంగకు యింకా పెళ్ళి చేయలేక పోయానన్న దిగులుతో నానాటికీ కృంగిపోతున్నారు కృష్ణయ్య గారు. అంతలోనే గ్రీష్మకూడా ఎదిగి వచ్చింది. ఒకళ్ళకిద్దరు పిల్లలు పెళ్ళికి సిద్ధమయ్యారు. గంగకు చదువు అంతగా అబ్బలేదు.

పైగా ఆ ఇంట్లో గంగ లేకపోతే క్షణం జరగదు. అందరికీ [illegible] అమర్చి పెట్టగల నేర్పు ఒక్క గంగకే సొంతం. అందుకే "యింక నేను చదవనునాన్నా!'' అన్న గంగను తండ్రీ తనూ కూడా బలవంతపెట్టలేదు. రేపో మాపో పెళ్ళిచేసి అత్తవారింటికి పంపవలసిన పిల్లకు యింకా చదువు చెప్పించే ఆర్థికస్తోమత లేక వూరుకున్నాడు తండ్రి.

కానీ గ్రీష్మచదువులో మొదటి నుంచీ శ్రీహరి పోలిక. స్కూల్లో ఫస్ట్‌న వుండే గ్రీష్మచదువు స్కూల్ ఫైనల్‌తోనే ఆపడం ఇష్టంలేక తనూ శ్రీధర్, తండ్రిని వప్పించి గ్రీష్మను కాలేజీలో జాయిన్ చేశారు. ప్రస్తుతం శ్రీహరి చదువు సమస్య లేదు కనుక ఎలాగో శ్రీధర్‌నూ, గ్రీష్మనూ కాలేజీ చదువుకు పంపగలిగారు. కానీ యిప్పుడు అది కూడా తలకుమించిన భారంగానే వుంది తండ్రికి. ఉద్యోగం రాకపోయినా రెండునెల్ల కోసారి వచ్చే యింటర్వ్యూలకు అటెండవ్వడానికే ఎక్కడి డబ్బూ చాలటంలేదు. ఎప్పటికప్పుడు, "ఛీ ఈ యింటర్వ్యూకు వెళ్ళకూడదు. బోలెడు ఖర్చు. ప్రయోజనం శూన్యం'' అను కుంటూనే మళ్ళీ ఏదో ప్రలోభం ఆ యింటర్వ్యూకు ఎటెండ్ అయ్యేలా చేసేదీ. కానీ ఫలితం శూన్యం. తండ్రి కలలు తన ఆశలు నెరవేరగలవన్న భావం దూదిపింజలా ఎగిరి పోతోంది రోజురోజుకూ.

మూడు సంవత్సరాలు! జీవితంలో అతి విలువైన క్షణాలన్నీ వుద్యోగాలకోసం తిరగటంతోనే సరిపోయింది. ముసలి వయసులో వున్న తండ్రి సంపాదన కూర్చుని తినడానికి సిగ్గుగా వున్నా మరో మార్గంలేదు. చెట్టంత కొడుకు తను వున్నా తండ్రి యింకా కష్టపడక తప్పడం లేదు.

ఏదైనా చిన్న వుద్యోగం దొరికినా చేద్దామనే ప్రయత్నించాడు. కానీ ఆ చిన్న వుద్యోగాలు మాత్రం అందుబాటులో వున్నాయా? వాటికీ రికమండేషన్సే; వాటికీ లంచాలే. తను గోల్డ్‌మెడలిస్ట్ అంతే....అది చెప్పుకోవడానికి పనికివచ్చే మెడల్. ఆ మెడలూ, ఆ సర్టిఫికెట్లూ తనకు వుద్యోగావకాశాల్ని యిప్పించలేకపోయాయి.

తనలాంటి దౌర్భాగ్యులెందరో ఈ దేశంలో.... అప్రయత్నంగానే శ్రీహర్శి కళ్ళ నుంచీ నీటి చుక్క రాలిక్రిందపడింది.

అంతసేపు అన్నయ్య ఏదో ఆలోచిస్తున్నాడను కుంటున్న గంగా, శ్రీధర్ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. వాళ్ళకు అర్థమైపోయింది. అన్న దేన్ని గురించి బాధపడుతున్నాడో అనవసరంగా ఆ రోజును గుర్తుచేసిన తన అవివేకానికి బాధ పడుతూ కళ్ళలో నీళ్ళు తిరుగుతున్న గంగను తీసు

కొని వంట గదిలోకి వెళ్ళాడు శ్రీధర్.

ఆలోచిస్తూ కుర్చీలోకూర్చుని వున్న కృష్ణయ్య గారి మనసులో శ్రీహరి ఫస్ట్ క్లాస్ తెచ్చుకున్న నాటి సంఘటనలూ, కాలేజ్‌లో తనకు శ్రీహరి తండ్రిగా జరిగిన సన్మానం, అన్నీ ఒక్కొక్కటే కళ్ళముందు సినిమారీళ్ళలా కదలాడుతుంటే బాధగా కళ్ళుమూసుకున్నారు. అంత ఆనందాన్నందించిన ఆ డిగ్రీ మూడేళ్ళలో ఒక చిన్న ఉద్యోగాన్ని సంపాదించలేకపోయింది.

గ్రీష్మ 'మంచి బట్టలు కావాలి! పండగకు పట్టు పరికిణీ కావాలి' అని మారాం చేస్తుంటే, దాన్ని బుజ్జగించి "అన్నయ్య పెద్ద ఆఫీసరైన తర్వాత నీకు కావలసినవన్నీ కొనిస్తాడమ్మా! మరి అందుకని యిప్పుడు మనం, అన్నయ్యను బాగా చదివించాలి. యిప్పుడు నువ్వు అలాంటి కోరికలన్నీ కోరితే అన్నయ్య చదువు మధ్యలోనే ఆగిపోతుంది. ఎప్పుడూ పట్టుపావడాలే కట్టుకునే అవకాశం నీ చెయ్యి జారిపోతుంది. మరి పట్టుపరికిణీ కావాలా?" అని అడిగితే—

"వద్దు వద్దు" అన్నయ్యను బాగా చదివించుదాము" అనేది ఆరిందాలా. దాని మాటలు విని అంతా నవ్వుకునేవాళ్ళు.

శ్రీహరి డిగ్రీతెచ్చుకున్న రోజున దాని సంబరం యింతా అంతా కాదు. ఇంక తను పట్టుపరికిణీలు తప్ప కట్టనని, తన అన్న పెద్ద ఆఫీసర్ కాబోతున్నాడనీ, చక్రాల్లాంటి కళ్ళు తిప్పుతూ ప్రక్కింటి పిల్లలందర్నీ పోగేసి, వాళ్ళందరినీ తెగ వూరించేది.

కానీ....ఏదీ ....ముచ్చటగా మూడేళ్ళు గడిచిపోయాయి. చూస్తూచూస్తుండగానే తన రిటైర్‌మెంట్ ఆర్డర్స్ కూడా వచ్చేశాయి ఈరోజే.... యింక ముందు రోజులు ఎలా గడుస్తాయి? శ్రీధర్ చదువు యింకా మధ్యలోనే వుంది. వాడు డిగ్రీ తెచ్చుకోవాలంటే యింకా రెండేళ్ళు చదవాలి. గంగ పెళ్ళి సమస్య ఒకటి. గ్రీషూకు అంత తొందరలేదు. కానీ యిక ముందు రోజులెలా గడవాలి? రేపటినుంచీ తనూ యింట్లోనే కూర్చుంటే అయిదుగురు సభ్యులున్న తమ కుటుంబం గడిచేదెలాగ? శ్రీధర్ చదువేమౌతుంది? గ్రీష్మనింక చదివించే తాహతులేదు. ఆ వుద్దేశ్యమూ లేదు. ఇంకా తన రిటైర్‌మెంట్ సంగతి ఎవ్వరికీ చెప్పలేదు. వింటే పిల్లలు మరింత బాధపడతారు. కానీ... కానీ రేపైనా తెలియాల్సిందేగా! ఈరోజు గ్రీష్మ సంతోషంలో నలుగురం పాలుపంచుకుంటే దానికి తృప్తి. లేకపోతే అది బాధపడుతూంది. పసి మనసును బాధించడమెందుకు? రేపటినుంచీ ఎలాగూ అందరూ ఎదుర్కోబోయే బాధను ఈరోజే చెప్పి అందరినీ బాధపెట్టడ మెందుకు?" అలా ఆలోచించుకున్న కృష్ణయ్యగారు —

"హరీ! గ్రీషూ కోసం పాయసంచేస్తానందిగా గంగ, వెళ్ళి కావలసిన సరుకులు తీసుకురారా!" అంటూ జేబులో నుంచీ డబ్బుతీసి యివ్వబోయారు.

"అన్నయ్య యిప్పుడే వచ్చాడుగా నాన్నా! నాకింకా వేరే పని కూడా వుంది బజార్లో, నే తెస్తాన్లే!" అంటూ ఆ డబ్బు శ్రీధర్ అందుకున్నాడు.

ఇంతలో గంగవచ్చింది శ్రీహరిని పిలుస్తూ.

"అన్నయ్యా! రైల్లోపడి వచ్చావు. లే....లేచి స్నానంచేయి. గ్రీషూ యిప్పుడప్పుడే రాదు. అది వచ్చింతర్వాత అందరం ఒక్కసారే కూర్చుందాం భోజనానికి" అంటుండగానే కృష్ణయ్యగారు అందుకున్నారు.

"ఔనురా! హరీ! వెళ్ళు, వెళ్ళి స్నానం చేయి. ఒరేయ్ ఏమేం కావాలో గంగను అడిగి వెళ్ళరా!" అంటూ చిన్న కొడుకును కేకవేశారు.

అప్పటికే గుమ్మం దాటుతున్న శ్రీధర్—

"లిస్ట్ యిందాకే తయారు చేసి యిచ్చింది నాన్నా!" అంటూ గుమ్మందాటి గబగబా ముందుకెళ్ళిపోయాడు.

శ్రీహరి టవల్ తీసుకు స్నానానికి వెళ్ళాడు.

"ఈరోజు గ్రీషూ కిష్టమైనవన్నీ చెయ్యమ్మా! అందరం కలసి కూర్చుని తిని ఎన్నాళ్ళైందో!" అంటున్న తండ్రివైపు నవ్వుతూ చూసి—

"అలాగే నాన్నా! పులిహోర కూడా కలిపాను. దానికిష్టమైన కూరలే వండుతున్నాను. పాయసం చేస్తాను. యింకేమయినా చెయ్యమంటారా" అంది.

"ఆ! గ్రీషూకు పెరుగువడ యిష్టంకదమ్మా!" అంటున్న తండ్రివైపు నిస్సహాయంగా చూసి—

"కానీ....యింట్లో అంత పెరుగెక్కడిది నాన్నా! వున్న పెరుగులో కొద్దిగా గ్రీషూకోసం తీసి పెట్టాను. మిగతాది మజ్జిగ చేశాను" అంది చిన్నబుచ్చుకుంటూ గంగ.

"ఫర్వాలేదు లేమ్మా! చేసినంతవరకూ చాల్లే!" అన్నారు నవ్వడానికి ప్రయత్నిస్తూ. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన గ్రీషూ కనీసపు కోరికలైనా తీర్చలేనందుకు తనని తానే నిందించుకుంటూ కుర్చీలో వెనక్కివాలారు మళ్ళీ.

ఆరోజు చాలా రోజుల తర్వాత అంతా తృప్తిగా సంతోషంగా ఒక్కటిగా భోంచేశారు. గ్రీష్మ వాళ్ళ కాలేజీ కబుర్లు చెబుతుంటే అంతా నవ్వుతూ విన్నారు. మధ్యమధ్యన శ్రీధర్ చెల్లెలి ఫ్రెండ్స్‌కు నిక్‌నేమ్స్ పెట్టి 'వాళ్ళసంగతేమిటి?' అని అడుగుతూ ఎగతాళి చేస్తుంటే పెద్దన్న దగ్గరచేరి 'చూడన్నయ్యా చిన్నన్నయ్య మా సమీరను అక్కుపక్షి అంటున్నాడు" అంటూ ఫిర్యాదు చేస్తుంటే మరింత వుడికిస్తూ—

"సరేలేవే, మీ, మీరాబాయ్ పాసైందో లేదో చెప్పు ముందు" అన్నాడు శ్రీధర్ చెల్లెలివైపు చూసి కొంటెగా నవ్వుతూ.

"అదిగో మళ్ళీ! నేనసలు చెప్పను పో. చక్కటి పేర్లుంటే అన్నీ మార్చి ఛ! ఛ! నువ్వెప్పుడూ యింతే! నేన్నీతో మాట్లాడను పో!" అంటూ బుంగమూతి పెట్టిన చెల్లెల్ని చూసి,

"నీకెందుకే అంత కోపం! పోన్లే ఇంకెప్పుడూ అలా అననులే" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

వాళ్ళిద్దరి కీచులాటా వినోదంగా చూస్తున్నారు కృష్ణయ్యగారు, గంగ, శ్రీహరి. వాళ్ళకు తెలుసు అంతలోనే పోట్లాడుకుని మళ్ళీ అంతలోనే ఒక్కటౌతారు. చిన్నన్నయ్య ఏదైనా అంటే పెద్దన్నయ్యతో ఫిర్యాదు చేస్తుంది. కానీ శ్రీహరి ఏమైనా అని తమ్ముడిని మందలిస్తే మళ్ళీ తనే అడ్డుపడుతుంది" పోన్లే అన్నయ్యా చిన్నన్నయ్య తప్పేం లేదు. నేనే ఏదో అన్నాన"ని చెప్పి అన్నను రక్షిస్తుంది మళ్ళీ.

"నీ ఫ్రెండ్స్ అంత అందగాళ్ళా? నా ఫ్రెండ్స్‌ను అంటే నాకు కోపంరాదేమిటి?" అంటున్న చెల్లెలి నెత్తిన చిన్నగా మొట్టుతూ —

"నీ ఫ్రెండ్ సమీర అందంగా లేదన్నానటే! ఏదో సన్నగా వుంటుంది కనుక, మా ఫ్రెండ్స్ పెట్టిన పేరు అక్కు పక్షి. ఇంతకూ డుమ్మా కొట్టిందా ఏమిటి? ఎంతకీ రిజల్ట్స్ చెప్పటం లేదు" అన్నాడు నవ్వుతూ.

"సన్నగా వుండే వాళ్ళను మెరుపు తీగలా వుందని మెచ్చుకుంటారు గానీ, అలా అష్టవంకర పేర్లతో పిల్చుకుంటారా? మా సమీరకేం సెకండ్ క్లాస్ తెచ్చుకుంది. నీలాగ మొద్దనుకున్నావా అదేమన్నా?" అంది గ్రీష్మ గర్వంగా అన్న వైపు చూస్తూ.

"నేను మొద్దునా! నిన్నా!" అంటూ వెంట పడిన శ్రీధర్‌కు అందకుండా కిలకిలా నవ్వుతూ శ్రీహరి వెనక చేరింది గ్రీష్మ.

"నాకివ్వాళ దొరక్కపోతావా? దొరికినప్పుడు నీ పని చెబుతా!" అంటూ దూరంగా వుండే బెదిరిస్తున్న చిన్నన్నయ్యను వెక్కిరిస్తూ తండ్రి ప్రక్కన మంచంమీద కూర్చుంది.

అందరికంటే చిన్నదైన గ్రీష్మ అంటే శ్రీహరికీ, గంగకూ శ్రీధర్‌కూ కూడా అమితమైన ప్రేమ. కృష్ణయ్యగారికి పంచప్రాణాలూ ఆ కూతురి మీదే వుంటాయి. ఏ కోరికైనా తనకు సాధ్యమైనంతవరకూ గ్రీష్మ కోరితే కాదనరు. అందుకే ఎప్పుడైనా తనకేమైనా అవసరాలొస్తే చెల్లెల్ని బుజ్జగించి, లాలించి తన కోరిక గ్రీష్మ ద్వారా తీర్చుకుంటుంటాడు శ్రీధర్. అతనికి అన్న దగ్గర చనువున్నా, పెద్దగా మాట్లాడడు. తండ్రితో మాట్లాడాలంటే మొదటి నుంచీ భయమే.

అందుకే మొదటినుంచీ శ్రీధర్ గంగకూ గ్రీష్మకూ మరింత దగ్గరవాడయ్యాడు. ఒక్కోసారి శ్రీధర్ వంటచేస్తున్న గంగదగ్గర కూర్చుని కూరలు తరగటంలో సాయం చేస్తుంటే చూసిన గ్రీష్మ

"పెద్దక్కయ్యా!" అంటూ శ్రీధర్‌ను ఎగతాళి చేసేది. అయినా అన్నయ్య అలా తమతో కలిసి తిరుగుతుండటమే సంతోషంగా వుండేది గంగకు.

కాలేజీలో చేరినా ఆ అలవాటు మారలేదు. శలవు రోజుల్లో తప్పకుండా గంగకు వంటలో సాయం చేస్తాడు శ్రీధర్.

ప్రొద్దుటే లేచి మామూలుగా కాలకృత్యాలు తీర్చుకున్న కృష్ణయ్యగారు బట్టలు వేసుకొని పడక కుర్చీలో కూర్చున్నారు. తొమ్మిది గంటలకల్లా "భోజనం రెడీ అయింది నాన్నా నువ్వూ, శ్రీధరన్నయ్యా వస్తే వడ్డించేస్తాను" అంటూ పిలిచిన గంగతో —

"నాకు తొందరలేదమ్మా! శ్రీకి పెట్టి పంపించు. వాడికి కాలేజీటైమ్ అవుతోంది" అంటున్న తండ్రివైపు ఆశ్చర్యంగా చూసి, ఏదో అడగాలని నోరు తెరిచిన గంగ శ్రీధర్ చెయ్యిపట్టుకుని లోపలికి తీసుకెళుతూంటే అయోమయంగా అన్నను అనుసరించింది. శ్రీహరి అప్పటికే బయటకు వెళ్ళిపోయాడు ఎవరినోచూడాలని.

"నాన్నగారివ్వాళ ఎందుకో అదోలా వున్నారన్నయ్యా! లేచిన దగ్గరనుంచీ చూస్తున్నాను ఏపని చేసినా అన్యమనస్కంగానే చేస్తున్నారు. భోజనానికి రోజూ నీతో కూర్చునేవారు. స్కూల్ టైమ్ అవుతున్నా నాకేం తొందరలేదు లేమ్మా అంటున్నారు. నాకెందుకో భయంగా వుందిరా నాన్నను చూస్తుంటే!" అంటున్న గంగవైపు జాలిగా చూసి—

"మరేం లేదు గంగా! నాన్నగారు నిన్నటితో రిటైర్ అయిపోయారు. యింక స్కూల్‌కు వెళ్ళే పనిలేదు. ఆ విషయం మనతో చెప్పలేక తనలో దాచుకోలేక బాధపడుతున్నారు. నాకు ఈ విషయం నిన్న సాయంత్రమే తెలిసింది. హెడ్మాష్టర్‌గారబ్బాయి శరత్ చెప్పాడు. కానీ నిన్న గ్రీష్మా ఆనందాన్ని భంగపరచడం యిష్టం లేక నాన్నగారు సంతోషంగా వున్నట్లు నటించారు. కానీ ఆయన మనసులోని బాధ నాకు తెలుసు" అంటూ—

"నాకూ ఆకలిగాలేదు గంగా! నేను కాలేజ్‌కు వెళుతున్నాను" అంటూ వెనుదిరిగిన శ్రీధర్ చేయి పట్టుకొని ఆపిన గంగ కళ్ళనిండా నీళ్ళున్నాయి.

"మధ్యాహ్నం వరకూ కడుపులో ఏం లేకుండా ఎలా వుంటావురా నేనే కలిపి పెడ్తాను. కొద్దిగా కూరన్నమైనా తినిపో! పస్తులుండాల్సిన రోజులు ముందు ముందు వున్నాయేమో! యిప్పటినుంచే ఎందుకన్నయ్యా!" అంటున్న గంగ మాట తీసివేయలేక ఆమె కలిపియిచ్చిన అన్నం బలవంతంగా స్పూన్‌తో తినేసి మంచినీళ్ళు త్రాగి బయట పడ్డాడు శ్రీధర్.

అప్పుడే స్నానం ముగించుకొని వచ్చిన గ్రీష్మ హాల్లోకి తొంగిచూసి యింకా తండ్రి వుండటం గమనించి తేలిగ్గా గాలి పీల్చుకొని నెమ్మదిగా తండ్రి దగ్గర చేరింధి.

ఏదో అడగాలని వచ్చిన కూతురు మాటి మాటికీ చేతిలోవున్న పుస్తకం వైపూ తనవైపూ చూపులు మరల్చడం గమనించిన కృష్ణయ్యగారు చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ—

"ఏంటమ్మా? ఏదైనామాట్లాడాలా నాతో" అన్నారు.

"ఆ! అదే! ఏం లేదు నాన్నా!" మాటలు మధ్యలోనే నాన్చేసింది గ్రీష్మ.

---

డి. సుభద్ర



తన గాన మాధుర్యంతో శ్రోతలను ఆకట్టుకుంటున్న వర్ధమాన గాయని కుమారి దేవన సుభద్రకు పది నెలల ప్రాయంలోనే కనుచూపు పోయింది. దృష్టిలేని లోపం కప్పిపుచ్చడానికా అన్నట్లు విధాత ఆమెకు చక్కని కంఠాన్ని ప్రసాదించాడు. ఏడు సంవత్సరాల ప్రాయంలోనే సుభద్ర పాటలు పాడడం ప్రారంభించింది.

సుభద్ర గుంటూరు జిల్లా రెంటచింతలలో గల మూగ, చెవుడు, గ్రుడ్డి వారి కోసం ప్రభుత్వం ప్రారంభించిన పాఠశాలలో చేరి అంధులకు వేర్పే బ్రెయిలీ లిపి నేర్చుకున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణురాలయింది. ఆ తరువాత విజయవాడ ఘంటసాల వేంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో చేరి సంగీతంలో డిప్లొమా పొందింది. తిరుపతి పద్మావతి స్త్రీల సంగీత కళాశాల ద్వారా 'సంగీత విశారద' పరీక్షలో ప్రథమురాలుగా ఉత్తీర్ణురాలయింది. విజయవాడ ఆకాశవాణి నిలయ విద్వాంసులు శ్రీ అన్నవరపు రామస్వామి సుభద్రకు సంగీతం నేర్పించిన గురువు. కుమారి సుభద్ర పలు సంగీత పోటీలలో పాల్గొని బహుమతులు, బంగారు పతకాలు గెలుపొందింది. ఈమధ్య ఆమెకు ఒక తెలుగు చిత్రంలో పాట పాడే అవకాశం కూడా లభించింది.

ప్రస్తుతం విజయవాడ మాంటిస్సోరి మహిళా కళాశాలలో మ్యూజిక్ టీచర్‌గా వుద్యోగం చేస్తున్న కుమారి సుభద్ర "ఉచితంగా నాకు బస, భోజన వసతులు కల్పించి చదువు చెప్పించిన ప్రభుత్వం వారు అన్ని అర్హతలూ వున్న అంధురాలిగా నాకు ప్రభుత్వ స్త్రీల సంగీత కళాశాలల్లో గానీ, ఆకాశవాణిలో గానీ ఎందుకు ఉద్యోగం ఇవ్వరో అర్థం కాని విషయం." అని వేదనతో అన్నది.

—మల్లిడి కనకరత్నం

"చెప్పుతల్లీ! ఏం కావాలి?" అంటూ ఆప్యాయంగా అడుగుతున్న తండ్రిని చూడగానే ఎక్కడిలేని ధైర్యం వచ్చేసింది.

"నాన్నా! మా క్లాస్‌మేట్ సమీర, యమునా వాళ్ళంతా మెడికల్ కాలేజ్‌కు అప్లై చేస్తున్నారు. మా ప్రిన్సిపాల్‌గారు మరీమరీ చెప్పారు. గ్రీష్మా నువ్వుకూడా తప్పకుండా అప్లై చేయి నీకు తప్పక సీట్ వస్తుందన్నారు. సమీరకు హైయ్యర్ సెకండ్ క్లాస్ వచ్చినా తప్పకుండా సీట్ దొరుకుతుందని వాళ్ళు నమ్మకంగా అనుకుంటున్నారు. వాళ్ళ బాబాయి మినిష్టర్ కదా తప్పకుండా సీట్ యిప్పిస్తారంటున్నారు నాన్నా! నేను కూడా అప్లై చేయనా?" అని ఆశగా, ఆతృతగా అడుగుతున్న గ్రీష్మవైపు నిస్సహాయంగా చూశారు కృష్ణయ్యగారు. నెమ్మదిగా గద్గదమవుతున్న గొంతు సరిచేసుకుంటూ అడిగారు.

"మరి మీ బాబాయిలెవరూ మినిష్టర్లు కాదుగామ్మా! నీ కెలా సీట్ దొరుకుతుంది? వేలకు వేలు డొనేషన్ కట్టాలన్నా మనవల్ల అయ్యేపని కాదుగా!" అన్నారు నెమ్మదిగా.

"నాకు మెరిట్ వుంది నాన్నా! మా ప్రిన్సిపల్ నన్ను తప్పకుండా అప్లై చేయమన్నారు. నాకు సీటు రాకపోతే మరెవ్వరికీ రాదన్నారు. డొనేషన్ కట్టాల్సిన అవసరం వుండదునాన్నా" ఒకింత గర్వం తొంగిచూసింది గ్రీష్మ స్వరంలో. గర్వం కాదది తనమీద తనకున్న ఆత్మవిశ్వాసం గ్రీష్మ చేత అలా మాట్లాడించింది.

ధైర్యంగా నమ్మకంగా తనకు సీట్ వస్తుందని చెబుతున్న కూతురివైపు చూసిన కృష్ణయ్యగారి కళ్ళు చెమర్చాయి. కూతురి చేతిని తన చేతిలోకి తీసుకొని తలమీద చేయివేసి నిమురుతూ మెల్లగా అన్నారు.

"నీకు సీట్ దొరుకుతుందమ్మా! నువ్వు తలుచుకుంటే అందులోనూ ఫస్ట్‌రాగలవు. గొప్ప డాక్టరమ్మవు కాగలవు. కానీ....కానీ....ఈ ముసలి తండ్రికి రత్నాల్లాంటి ...బిడ్డలున్నా ...రత్నాల రాసులో, కాసులో లేవమ్మా! బిడ్డలకు ఉన్నత విద్యలు చెప్పించాలనే అంతులేని ఆశలు వున్నా వాటిని ఆచరణలో పెట్టలేని అశక్తుడమ్మా ఈ తండ్రి. శ్రీహరన్నయ్య యమ్. ఏ. గోల్డుమెడలిస్ట్. వాడి చేత పి. హెచ్ డి. చేయించాలనీ, ఫారిన్ చదువులకు పంపాలనీ ఎన్నో ఆశలుండేవి.

కానీ పరిస్థితులు మనకు అనుకూలంగా లేనపుడు వాటి కనుగుణంగా ఆశలు, ఆశయాలు అణుచుకోక తప్పదమ్మా!

అందుకే అందాల భవిష్యత్తు వూహించుకుంటున్న శ్రీహరిని యమ్. ఏ తోనే ఆపుచేశాను.

వాడూ పరిస్థితులను అర్థంచేసుకొని వుద్యోగ ప్రయత్నాల్లో పడ్డాడు. మూడు సంవత్సరాలు గడచిపోయినా అందరూ ఎంతగానో అభివృద్ధిలోకి వస్తాడని ఆశించిన అన్నయ్యకు ఏ వుద్యోగమూ రాలేదు. నిరాశానిస్పృహలతో వాడు రోజు రోజుకూ, నా కళ్ళముందే వుత్సాహం చచ్చిపోయి నీరసించిపోతున్నాడు.

గంగకు చదువు అబ్బ లేదు. దాన్ని ఓయింటి దాన్ని చేయాలని నేను చేస్తున్న ప్రయత్నాలు ప్రయత్నాలుగానే వుండిపోతున్నాయి. అన్ని నిత్యావసర వస్తువులతో పాటు అంగడిలో అమ్ముడుపోతున్న వరులకు యివ్వాల్సిన కట్నం రేటూ రోజురోజుకూ పెరిగిపోతున్న ఈ వ్యవస్థలో అక్కయ్య పెళ్ళి చేయగలనా ఈ జన్మలో అనే సందేహం కలుగుతోంది.

శ్రీధర్ చదువింకా మధ్యలోనే వుంది. వాడికి డిగ్రీ రావడానికి కనీసం యింకో రెండేళ్ళు చదవాలి.

ఇవన్నీ సమస్యలుగానే వుండగా మరో సమస్య వచ్చిపడింది తల్లీ!" తండ్రి చెబుతున్న మాటలు శ్రద్దగా వింటున్న గ్రీష్మ ఆయన కళ్ళనుంచీ కన్నీటి బొట్లు రాలడం చూసి తండ్రిని కౌగలించుకొని బావురుమంది.

"అందరూ సమస్యలన్నీ విని, అర్థం చేసుకోవడం కుటుంబానికి ముఖ్యమమ్మా! నిన్నటితో నాకూ నా వుద్యోగానికీ ఋణం తీరిపోయింది. నేను రిటైర్ అయిపోయానమ్మా! ఇకముందు మన కుటుంబ భవిష్యత్ ఎలా వుంటుందో తలుచుకోడానికే భయంగా వుంది తల్లీ!" అంటున్న తండ్రి గుండెలమీద వాలి వెక్కివెక్కి ఏడ్చింది గ్రీష్మ.

అప్పటివరకూ తనూ ఫ్రండ్స్‌తో పాటు మెడిసన్ చదవాలనీ గొప్ప డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలనీ కలలు కంటూ, ఆకాశ సౌధాలు నిర్మించుకుంటున్న మనస్సు, ఒక్కసారిగా వాస్తవంలోకి వచ్చి పడేసరికి, తను ఎంత అవివేకంగా వూహించిందో తలుచుకొని కుమిలిపోయింది. ఏ పూటకాపూట కడుపునిండా తినగలగటమే మహాభాగ్యంగా వున్న తమకు, అంతటి ఉన్నత విద్యలెలా అందుబాటులో వుంటాయి? నెమ్మదిగా తండ్రి దగ్గిర నుంచి లేచింది గ్రీష్మ. ఆశలు ఆరిపోయిన దీపాలయ్యాయి.

ఎదురుగా కన్నీళ్ళతో అక్క నిలబడి వుంది. తమ మాటలన్నీ విన్నదనడానికి నిదర్శనంగా ఆమె కళ్ళలో అంతులేని ఆవేదన.

దీనంగా దూరంగానుంచొని కన్నీరు కారుస్తున్న గంగను దగ్గరకు పిలిచారు కృష్ణయ్యగారు.

తండ్రిదగ్గరకెళ్ళి మోకాళ్ళ మీద కుర్చీదగ్గిరగా కూర్చున్న గంగ తల నిమురుతూ మరో చేత్తో గ్రీష్మ చేయిపట్టుకున్నారు.

"ఈ సంవత్సరం నాకు వచ్చే ప్రావిడెంట్ ఫండ్‌తో అక్కపెళ్ళి చేద్దామమ్మా! ఇంక నీ గురించిన బాధ, శ్రీధర్‌ను గురించిన బాధేదో శ్రీహరే పడతాడు. ఈలోపుగా అన్నయ్యకు ఏదో వుద్యోగం రాకపోతుందా!" అంటూ మళ్ళీ తనే తనకులేని ధైర్యం కూతురికి కలిగించాలని చూశారు.

"నా పెళ్ళికేం తొందరవచ్చింది నాన్నా! మీ ప్రావిడెంట్ ఫండ్‌తో గ్రీషూను చదివించండి. దానికి చదువుకోవాలనే కోరిక బాగా వుంది', అంటున్న గంగవైపు చూసి చిన్నగా నవ్వుతూ. "ప్రావిడెండ్ ఫండ్‌తో పూర్తయ్యే చదువు కాదక్కయ్యా నాది. ఆ తర్వాత మళ్ళీ మధ్యలో ఆపేయ్యాల్సి వస్తుంది. అయినా ఎందుకొచ్చిన చదువులెద్దూ! నీ పెళ్ళైపోతే నాన్నకూ అన్నయ్యకూ పెద్ద రిలీఫ్‌గా వుంటుంది. కదూ నాన్నా!" అంటున్న గ్రీష్మ చేయి మృదువుగా పెదాల కంటించుకుంటూ—

"అవునమ్మా! నాకు తెలుసు నా బిడ్డలెప్పుడూ నన్నర్థం చేసుకొని అనుగుణంగా నడుచుకుంటారు. ఈ అంధకారజీవితంలో అదే అదృష్టం. మీరే నా ఆశాకిరణాలు" అంటున్న కృష్ణయ్యగారి గొంతు గద్గదమైంది. అప్పుడే లోపలికొచ్చిన శ్రీహరి వాతావరణం గంభీరంగా వుండటం చూసి నెమ్మదిగా తండ్రిగారి దగ్గిర చేరాడు.

ప్రశ్నార్థకంగా చూస్తున్న శ్రీహరివైపు కళ్ళెత్తి చూసి చెల్లెళ్ళిద్దరూ తండ్రివైపు చూపులు మరల్చారు.

"ఏమిటి నాన్నా? ఏంజరిగింది? ఎందుకంత దిగులుగావున్నారంతా?" ఏవిటో తెలుసుకోవాలన్న ఆతృతకు తోడు వాళ్ళున్న పరిస్థితి ఆవేదన కలిగిస్తుంటే గబగబా అడిగాడు శ్రీహరి.

"ఏంలేదు హరీ! నిన్నటితో నేను రిటైర్

అయాను '' అంతే ఆ పైన తండ్రి చెప్పిన మాట లేవీ వినిపించలేదు శ్రీహరికి.

మౌనంగా లేచి తన గదిలోకి పోతున్న కొడుకు వైపు చూస్తూ కూర్చున్నారు కృష్ణయ్యగారు.

ఏంలేదని తను చెప్పిన ఆ మాట ఎంత బరువైనదో శ్రీహరికి తెలుసు – అందుకే అందరి ముందూ తనూ బయటపడటం యిష్టం లేక ఆ బాధను ఒంటరిగానే అనుభవించాలని గదిలో కెళ్ళాడు.

మొదటి నుంచీ అతని తత్వమే అంత. తనెంత బాధపడ్డా యింట్లో ఎవ్వరికీ తెలియనీయడు. అతి సుతి మెత్తని మనసు. ప్రతిచిన్న విషయానికీ విపరీతంగా బాధపడతాడు. కానీ అది ఎవరికీ తెలీకుండా వుంచడానికి ప్రయత్నిస్తాడు. తనలో తానే కృంగి కృశించిపోతాడు.

ఇంతక్రితం యింటర్వ్యూలకు వెళ్ళి రాగానే హుషారుగా అక్కడి కబుర్లు చెప్పి నవ్వించేవాడు అందరినీ. అతను చెప్పకపోయినా గ్రీష్మ, గంగా చెప్పించుకొని విని నవ్వుకునే వాళ్ళు. కానీ ఆ యింటర్వ్యూలకు వెళ్ళి వెళ్ళి విసుగెత్తిపోయిన శ్రీహరి యిప్పుడు ఆ విషయాలు తప్ప మిగతా విషయాలే మాట్లాడతాడు. అన్నకు బాధ కలిగించే ఆ విషయాలు వినాలని గ్రీష్మ, గంగా కూడా యిప్పుడు మునుపటిలా ఆతృత పడటం లేదు.

ఇంతక్రితం యింటర్వ్యూ అంటే వుద్యోగమే వచ్చిందన్నంత సంబరంగా, అట్టహాసంగా బయలుదేరేవాడు. ఇప్పుడా వుత్సాహం చచ్చిపోయింది. నామకహా జరిగే ఆ యింటర్వ్యూ ఫలితాలు ముందే తెలిసిపోతుంటే వాటికి వెళ్ళాలని కూడా అనిపించడం లేదు. ముందే ఎవర్నో నిర్ణయించి, తనలాంటి దౌర్భాగ్యులచేత ట్రైన్ ఖర్చులు అప్పులు చేయించి పిలిపించే ఆ యాజమాన్యాల వారిని అక్కడి కక్కడే చంపి పాతరవేయాలన్నంత కోపం వస్తోంది. నిన్న హైద్రాబాద్ వెళ్ళివచ్చిన దగ్గరనుంచీ మనసులో మరీ బాధగా వుంది. తను యింటర్వ్యూలో చక్కగా ఆన్సర్ చేశాడు. తన మెరిట్ చూసి మెచ్చుకున్న ఆఫీసర్ తను తిరిగి వస్తుంటే ప్రక్కకు పిలిచి చెప్పాడు.

"ఆ వుద్యోగం అంతక్రితమే ఒక పెద్దవారి బావమరిదికి ఎలాట్ చేశారు. ఇకముందు ఎలాంటి అవకాశమున్నా నిన్ను తప్పకుండా తీసుకుంటా మోయ్!'' అంటూ చెబుతున్న ఆ ఆఫీసర్ని చెంప పగులగొట్టాలన్నంత కోపమొచ్చింది. "అంతమాత్రానికి ముందే ఎవరికో రిజర్వ్ చేసిన ఆ సీటుకోసం మమ్మల్ని పాతిక మందిని యింటర్వ్యూకు ఎందుకు పిలిచారు?'' అని గట్టిగా అడగటంతో, పెద్ద గొడవైంది.

"అది మా ప్రొసీజర్. డోంటాక్ నాన్సెన్స్ హియర్. యుకెన్ గో.'' అంటూ పంపించివేశాడు కోపంగా అంతవరకూ మెచ్చుకున్న ఆఫీసర్. బయటకువచ్చి వుద్యోగమొస్తుందని గంపెడంత ఆశతో తనలాగే దూర దూరాల్నుంచీ వచ్చిన తోటి సోదరుల్ని పిలిచి, జరిగింది చెప్పాడు. వాళ్ళంతా వుద్రేకంతో వూగిపోయారు.

ఎవరూ పరిష్కరించలేనిది ఈ నిరుద్యోగ సమస్య. తన సమస్య సమస్యలాగే వుండగా, తండ్రి రిటైర్ అవ్వడంతో కుటుంబానికి వున్న ఒక్క ఆధారమూ వూడినట్లైంది. ఉద్ధరిస్తాడను కున్న తను తండ్రి సంపాదన తింటూ కూర్చో టానికే వుపయోగ పడ్డాడిన్నాళ్ళు. కానీ ముందు ముందు కుటుంబం ఏంకావాలి? ఎలా జరుగుతుంది? శ్రీధర్ చదువు, గ్రీష్మ చదువు, గంగ పెళ్ళి, అన్నీ సమస్యలే! తను వెంటనే ఏదో


5 సంవత్సరాలు గ్యారంటీ గల మెరీ సూపర్ స్పెషల్ బంగారు కవరింగ్ నగలను 15 సంవత్సరాల పరిశోధన ఫలితంగా – భారత దేశంలో ప్రప్రథమంగా తయారు చేస్తూ, దేశమంతటా విరివిగా వి. పి. పి. ద్వారా పంపే సంస్థ. ఉచితంగా కేటలాగ్ పొంది అన్ని వివరాలు చూడగలరు. ఇందులోని సంఖ్యలు సూచిస్తూ, ఉత్తరం రాస్తే, వీ. పి. పి. ద్వారా వస్తువులు పంపబడతాయి.

(వి. పి. పి. చార్జీలు అదనం)



MERI GOLD COVERING WORKS ESTD: 1963

TRADE MARK (346088).

14, RANGANATHAN STREET, T. NAGAR, POST BOX No. 1405, MADRAS-600 017

కూలిపనైనా చేయకపోతే లాభం లేదు; మిగతా సమస్యలెలా వున్నా అందరూ పస్తులు పడుకోవాల్సిన పరిస్థితులు రాకూడదు; తను బ్రతికుండగా తమ యింటి పరిస్థితులు అలా మారకూడదు. తండ్రికి ధైర్యం చెప్పాలి—అనుకుంటూ లేచి ముఖం కడుక్కుని హాల్లోకి వచ్చాడు శ్రీహరి. అప్పటివరకూ కన్నీళ్ళు కార్చిన కళ్ళు యింకా ఎర్రగా జ్యోతుల్లా మెరుస్తూనే వున్నాయి.


హాల్లో అదే ప్రదేశంలో కూర్చుని వున్న చెల్లెళ్ళనూ తండ్రినీ చూసి చిన్నగా నవ్వుతూ—

"ఇప్పుడేం జరిగిందని నాన్నా! అంతా బాధపడుతున్నారు? ఇది మీరు విశ్రాంతి తీసుకోవాల్సిన వయసే కదా! నాకు వుద్యోగమొస్తే నేనే మాన్పించేద్దామనుకున్నాను. మరో నెలా రెండునెలల్లో నేను చేద్దామనుకున్న పని గవర్నమెంటువారే చేశారు. గంగా! నాన్నా భోంచేశారా?" అన్నాడు చెల్లెలివైపు తిరిగి. "లేదన్నయ్యా! యింకా ఎవ్వరూ భోంచేయలేదు" అంది కళ్ళు తుడుచుకుంటూ లేచి నుంచొని వంటింటివైపు కదులుతూ.

"పద పద! అందరికీ వడ్డించు ఏయ్ గ్రీష్మా! మీ సమీర కనిపించిందే యిందాక. నిన్ను సాయంత్రం వోసారి వాళ్ళింటికి రమ్మని చెప్పింది." అంటూ తండ్రి చేయిపట్టుకుని లేపి గ్రీష్మ చేయి పట్టుకుని గంగను అనుసరించాడు—శ్రీహరి. తనెంత బాధపడ్డా బయటికి కనిపించనీయని శ్రీహరి వైపు తృప్తిగా చూస్తూ వంటగదివైపు అడుగులు వేశారు కృష్ణయ్యగారు. మంచితనం మానవత్వం ఓ మూసలోపోసి దానితో బ్రహ్మ సృష్టించాడా అన్నట్లుండే ఆ కొడుకును చూసుకొని తృప్తిపడటమే మిగిలింది. అతని అభివృద్ధిని కళ్ళారా చూడగల అదృష్టమే కలగటం లేదు, తను బ్రతికుండగా వాడి ముఖంలో మళ్ళీ మునుపటి కళాకాంతులు చూడగలనా? అన్న ఆలోచనలతో అన్యమనస్కంగానే పిల్లల కోసం భోజనానికి కూర్చున్నారు కృష్ణయ్యగారు.

ఎవరికి వారు తాము తినకపోతే మిగతావాళ్ళు తినరనే, బలవంతంగా భోంచేశారు. ఎవరికీ ఆ రోజు నిజానికి భోంచేయాలని లేదు. గ్రీష్మకు నిన్నటిరోజు ఎంత ఆనందంగా గడిచిందో తలుచుకుంటుంటే అందుకు పూర్తిగా భిన్నంగా వున్న ఈ రోజును చూస్తుంటే బాధతో మనసంతా వికలమైయింది.

భోంచేసి వెళ్ళి పడుకున్నారు కృష్ణయ్యగారు.



న్యూజెర్సీ (అమెరికా) నగరంలో ఒక అవివాహితకి మూడేళ్ళ క్రితం ఒక వింత కోరిక కలిగింది—తను మాతృమూర్తి కావాలని. అప్పటికే ఆమెకి ఒక యువకుడితో పరిచయం వుంది. కాని అతడిని పెళ్ళి చేసుకోవాలని ఆమెకి లేదు. అసలు పెళ్ళి చేసుకోవాలన్న కోరికే ఆమెకు లేదు. ఐతే, తన స్నేహితురాలి కోరిక తీర్చడానికి ఆ యువకుడు అంగీకరించాడు. ప్రయోగ నాళికా పద్ధతి ద్వారా ఆ యువతి కాస్తా తల్లి అయింది. టెస్ట్ ట్యూబ్ బేబి కూడా బాగా ఆరోగ్యంగా పెరిగాడు. ఇంతవరకూ బాగానే వుంది కానీ ఇప్పుడా అమ్మాయి స్నేహితుడు కాస్తా ఆ శిశువుకి తన ఇంటి పేరు పెట్టుకోవాలనుకున్నాడు. ఆ పిల్లాడి పోషణకు అయ్యే ఖర్చు భరించడానికి కూడా సంసిద్ధమయ్యాడు. కాని ఆ యువతి మాత్రం ఎందుకోగానీ వీటికి అంగీకరించడం లేదు. దాంతో అతడు న్యాయస్థానానికి వెళ్ళాడు. న్యాయస్థానం ఆ యువకుడి తరఫున తీర్పు చెబుతూ 'తండ్రి'గా అతడు తన బాధ్యత నిర్వర్తించాలనుకోవడంసబబేనని ఆ పిల్లాడి భవిష్యత్తుకి కూడా అది ప్రధానమనీ చెప్పింది. నిజమే కదామరి. రేపొద్దున్న దరఖాస్తులలో 'నీ తండ్రి పేరేమిటి' అని అడిగితే 'ప్రయోగనాళిక' అనేవాడు కదా!

Vemakoti Seeta Rama Sastry
WRITER
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.

అలవాటుకు విరుద్ధంగా గంగ వంటిల్లు సర్దుకుంటుంటే, అక్కడే పీటమీద కూర్చున్నాడు శ్రీహరి. గ్రీష్మతోపాటు ఏదో ఆలోచిస్తూ శూన్యంలోకి చూస్తున్న అన్నవైపు చూస్తూ చెప్పింది గంగ

"నాన్న చాలా బాధపడుతున్నారన్నయ్యా! నాకీ విషయం ప్రొద్దుటే తెలిసింది. శ్రీధరన్నయ్య చెప్పాడు. అప్పుడే అర్థమైంది నాన్న నిన్నటి నుంచీ అలా ఎందుకున్నారో. స్కూల్‌కెళ్ళి వచ్చిన దగ్గరనుంచీ దిగులుగానే వున్నారు. ఆ తర్వాత గ్రీష్మ సంతోషంకోసం ఆయనా సంతోషంగా వున్నట్లు కనిపించారు కానీ మనసులో బాధపడుతూనే వున్నారు కాబోలు" అంది గంగ అన్నీ సర్ది తనూ వచ్చి గ్రీష్మ ప్రక్కన కూర్చుంటూ.

అప్పటివరకూ ఏదో ఆలోచనలో వున్నట్లున్న శ్రీహరి చిన్నగా నవ్వుతూ "మీరెందుకమ్మా అంత కంగారు పడుతున్నారు? నాన్నగారికి రెండు రోజులు స్కూల్‌కు వెళ్ళకపోయేసరికి ఏదో వెలితిగా దిగులుగా అనిపిస్తుంది. ఆ తర్వాత అదే అలవాటౌతుంది. నాకు వుద్యోగమొచ్చిందంటే యింక మనకు ఏ చిక్కులూ వుండవు" ఆఖరి మాట అంటున్నప్పుడు శ్రీహరి కంఠం సన్నగా వణికింది. తను అంత తేలిగ్గా చెప్పేసిన ఆ వుద్యోగం రావడమనే విషయం ఎంత కష్టమైనదో తనకూ తెలుసు. తన ఎదురుగా కూర్చుని వింటున్న చెల్లెళ్ళుకూడా ఆ మాత్రం అర్థంకాని అవివేకులు కారు. అందుకే ఆ మాట పూర్తిచేస్తూనే లేచి గబగబా వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న అన్నవైపు జాలిగా చూస్తూ కూర్చున్నారు గ్రీష్మ, గంగ.

ఆ రోజు శ్రీధర్ కాలేజ్ నుంచీ రాగానే హడావుడిగా శ్రీహరి దగ్గరకెళ్ళాడు. చేతిలో ఏదో పుస్తకం పెట్టుకొని చూపులు మరెక్కడో సారించి వున్న అన్నవైపు దిగులుగా చూశాడు.

అప్పటికి కృష్ణయ్యగారు రిటైర్ అయ్యి రెండు నెలలు అయింది. ఈ రెండు నెలల్లో శ్రీహరి వుద్యోగం కోసం చేయని ప్రయత్నాలు లేవు. ఎక్కడికెళ్ళినా చుక్కెదురే అయింది. ఆఖరికి రోజు రోజుకూ యింటో పరిస్థితులు మరింత

అధ్వాన్నంగా మారడం చూసి ఒకటి రెండు చోట్ల కూలిపనికి కూడా ప్రయత్నించి భంగ పడ్డాడు. ఆఖరికి వాళ్ళను బ్రతిమాలి ఆపనిలో చేరినా సాయంత్రానికి ఆ రాళ్ళు కొట్టే పనితో చేతులు బొబ్బలెత్తాయి. చేతిలో పడిన మూడు రూపాయలతో యింట్లోని ఏ అవసరాలు తీరతాయి? తమ్ముడికి కాలేజ్ ఫీజు కట్టాలి. యింట్లోని మామూలు అవసరాలు కూడా కుదించుకుంటూ అతి జాగ్రత్తగా సంసారాన్ని నడుపు కొస్తోంది గంగ. తండ్రి ఆరోగ్యం దెబ్బతింది. ఈ పరిస్థితుల్లో మాటి మాటికీ గంగ పెళ్ళివిషయం గుర్తు చేసుకొని బాధపడే తండ్రిని ఓదార్చటం మరీ కష్టంగా వుంది ఈ మధ్య.

వరకట్నాలమీద తనకెంతటి వ్యతిరేక భావాలున్నా, అవి తనవరకే పరిమితం. మళ్ళీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ సమస్య మామూలే. వాళ్ళకు కట్నాలివ్వందే వరుడు దొరకటం అసాధ్యమనే నగ్న సత్యం తెలీనివాడు కాడు. అవన్నీ కాలేజ్ రోజుల్లో తమ వూహాగానాలు మాత్రమేననీ వాటిని ఆచరించేవాడు నూటికి ఒక్కడుకూడా దొరకడని గుర్తించడానికి ఎక్కువ రోజులు పట్టలేదు శ్రీహరికి.

అందుకే తండ్రి కోరిక తీర్చడంకోసం ఎలాగోలా, గంగ పెళ్ళి జరిపించేయాలనే నిర్ణయానికి వచ్చాడు. ఆ ప్రయత్నంలో పడ్డాడు కానీ వచ్చే వరుల రేటుకు తూగలేక ప్రతిదీ కాన్సిల్ చేసుకోవాల్సి వస్తోంది.

తనరాకను కూడా గమనించకుండా దీర్ఘాలోచనలో వున్న అన్నను చూసి నెమ్మదిగా పిలిచాడు శ్రీధర్.

"అన్నయ్యా!"

వులిక్కిపడినట్లు తిరిగి చూసిన శ్రీహరి చెమ్మగిల్లి వున్న కళ్ళను ముఖాన్నీ టవల్‌తో తుడుచుకుంటూ, చిన్నగా నవ్వడానికి ప్రయత్నిస్తూ అడిగాడు. "ఏరా శ్రీ అప్పుడే వచ్చేశావా? ఏమిటి నాతో ఏదైనా పని వుందా?"

"అన్నయ్యా! నేనింక కాలేజ్‌కు వెళ్ళను. ఏదో పని చూసుకుంటాను." తల దించుకొని నెమ్మదిగా చెబుతున్న శ్రీధర్ వంక ఆశ్చర్యంగా చూశాడు. "అదేమిటిరా! డిగ్రీ మధ్యలో వదిలేసి పని చూసుకుంటావా? నీకేమైనా మతిపోయిందా?" అన్నాడు ఆదుర్దాగా, ఆవేశంగా.

"ఆ మతి పోగూడదనే నేను కాలేజీ మానేస్తున్నా నన్నయ్యా! ఫీజులు కట్టలేని మనకు కాలేజీ చదువులెందుకు! ప్రతిరోజూ క్లాసులో ఫీజు కట్టలేదని అక్కడ నిలదీసి అడుగుతుంటే సమాధానం చెప్పలేక నేను నేలచూపులు చూడాల్సి వస్తోంది. తోటి స్టూడెంట్స్ సానుభూతితో మన పరిస్థితిని అర్థం చేసుకోకపోగా ఎగతాళి చేస్తున్నారు.

మొన్న వచ్చిన క్రొత్త లెక్చరర్ చాలా అవమానించారు. "కట్టుకోడానికి సరైన బట్టలు కూడా లేకుండా కాలేజీకి ఎలా వస్తారోయ్ మీ స్టూడెంట్స్? ఆ మాత్రం జ్ఞానం వుండొద్దూ!" అన్నారు. నేను వెంటనే క్లాసు వదిలేసి వచ్చేశాను. ఇంక చచ్చినా నేనాకాలేజీకి వెళ్ళనన్నయ్యా!" కళ్ళవెంట బొట బొటా కన్నీరు కారిపోతుంటే తల వంచుకొని గబ గబా ఆవేశంగా చెప్పుకుపోతున్న శ్రీధర్‌వంక పరీక్షగా చూసిన శ్రీహరికి కడుపులో దేవినట్లైంది. కాలేజీకి వెళ్ళే తమ్ముడికి సరైన తిండీ, బట్టలూ, ఫీజుకూడా కట్టలేని తమకు నిజంగానే కాలేజీ చదువు లెందుకు? అంతలోనే తన ఆలోచనలు కట్టిపెట్టి, లేచి, తమ్ముడి భుజంమీద చేయివేసి చెప్పాడు అనునయంగా.

"శ్రీ ఆవేశపడకురా! మధ్యలో చదువు ఆపితే నష్టపోయేది మనమేరా! రేపటికి ఎలాగో నేను సర్దుబాటు చేస్తాను. అంతగా అయితే గంగ పెళ్ళికోసం దాచిన డబ్బులోనుంచీ తీసి యిస్తాను. నువ్వు తొందరపడి ఏ నిర్ణయానికీ రాకు." అంటున్న అన్నవైపు చూసి మళ్ళీ తల దించుకుంటూ—

"నన్ను క్షమించన్నయ్యా నీ మాట కాదంటున్నందుకు. ఎక్కడ తెచ్చి కడతావన్నయ్యా! గంగ పెళ్ళికోసం దాచిన డబ్బు ఏ అవసరాలకూ తీయకూడదని మనందరం కలిసి అనుకున్న మాట మర్చిపోయావా? పోతే పోయింది లెమ్మని నీ గోల్డుమెడల్ అమ్మి కడతావు. అలా కట్టినా యింకా రెండు సంవత్సరాలున్న నా డిగ్రీ చదువు పూర్తికాదు!' యిప్పుడు శ్రీధర్ చూపులు అన్న ముఖంమీద కేంద్రీకృతమయ్యాయి. శ్రీహరి చూపులు నేలను కరచుకున్నాయి.

"బాధపెట్టివుంటే క్షమించన్నయ్యా! నాకు తెలీక అడుగుతున్నాను యింతకష్టపడి యింతగా ప్రాకులాడి ఆ డిగ్రీ సంపాదించి ఏం చేయాలి? ఆ డిగ్రీతో వుద్యోగాలు వచ్చి వళ్ళో పడుతున్నాయా? మూడేళ్ళక్రితం గోల్డుమెడల్‌తోసహా అందుకున్న నీ డిగ్రీతో నువ్వు సాధించిందేవిటన్నయ్యా! పైగా దానివల్ల నష్టం చాలా వుంది, మనం చేయాలనుకునే చిన్న పనులకు అది అడ్డమవుతుంది. ఇంత చదువు చదివి ఈ పని ఎలా చేయను? అనే తార్కికవాదం వస్తుంది. యిన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ పెరుగుతుంది. హాయిగా వళ్ళు వంచి పని చేసుకుందామన్నా .... "చదూకున్న మారాజులు మీకేటి శాతవుద్ది బాబూ! ఈ మోటు పని!" అంటూ కూలివాళ్లు కూడా మనను వెలివేస్తారు. ఈ మాత్రం దానికి కష్టపడి ఆ డిగ్రీ సంపాదించి ఎవర్ని వుద్ధరించాలన్నయ్యా?"

శ్రీధర్ చెప్పే ఒక్కోమాటా అక్షరసత్యం. అతనడిగే ప్రశ్నలకు సమాధానాలు లేవు తన దగ్గర. ఇది తన ఒక్క కుటుంబ సమస్యకాదు. ఇలాంటి కుటుంబాలు కొన్ని వందలు, వేలు వుండవచ్చు ఈ పవిత్ర భారతావనిలో. కడుపులు కట్టుకొని సంపాదించుకున్న డిగ్రీలు కడుపునింపలేవు. కూలి పని కోసం వెళ్ళి స్వయంగా తను పడ్డమాటలు తమ్ముడి నోట వింటుంటే, ఆ సందర్భాలు కళ్ళముందు కదలాడాయి. కళ్ళనిండా నీరూరింది. తమ్ముడి వాదనలోని, నిజం, తనకు అనుభవమే.

అందుకే మరో మాట మాట్లాడకుండా తన కన్నీరు తమ్ముడికంట పడకుండా మౌనంగా బయటకు వెళ్ళిపోయాడు శ్రీహరి.

శ్రీహరి వెళ్ళిపోయిన తర్వాత తను అన్న దగ్గిర మరీ అంత ఆవేశంగా మాట్లాడకుండా వుండి వుండాల్సింది—అనుకున్నాడు శ్రీధర్. అన్నయ్య చాలా బాధ పడ్డట్టున్నాడు. కానీ తప్పదు. ప్రతిరోజూ ఛస్తూ తను బ్రతకలేడు. ఆడపిల్లల దృష్టిలో కూడా లోకువై తను ఇంకా ఆ కాలేజ్‌లో అడుగెలా పెట్టగలడు? గంగ, జాగ్రత్తగా కుట్టిన జేబు మళ్ళీ ఎప్పుడు చిరిగిందో తను చూసుకోలేదు. లెక్చరర్ ఏదో ఆన్సర్‌చేసి చూపించమని బోర్డుదగ్గరకు పిలిచినప్పుడు ఆన్సర్ చేస్తున్న తనను ద్దేశించి, లెక్చరర్ అన్న మాటలు గుండెల్లో గునపాల్లా గుచ్చుకుంటున్నాయింకా. జేబు మొత్తం క్రిందికి వేలాడబడి వుంటే అది చూసి, దాన్ని పట్టుకొని క్లాసందరికీ చూపిస్తూ అవమానపరచాడు మానవత్వం మరచి.

వెంటనే చాక్‌పీస్ విసిరికొట్టి, బుక్స్ తీసుకొని క్లాసునుంచీ బయట పడుతుంటే లెక్చరర్‌తో క్లాసు క్లాసంతా నవ్వడం వింటూ,

మరోక్షణం ఆగకుండా యింటికొచ్చేశాడు. అంత క్రితం క్లాసులో ఫీజుకట్టలేదని అందరిలో నుంచో బెట్టి మరీ అవమాన పరిచాడు ఇంకొకాయన.

"ఇంకా ఎన్నాళ్ళయ్యా? అందరూ కట్టేశారు. ఫీజు కట్టలేని వాళ్ళకు కాలేజీ లెందుకయ్యా దండగ!" అంటుంటే మౌనంగా తలదించుకున్న తనను చూసి—

"ఆడపిల్లలా సిగ్గుపడటం కాదోయ్! పౌరుష ముంటే రేపీ పాటికి ఫీజు కట్టి చూపించు" అంటూ వెళ్ళిపోయాడు. అదింకా పచ్చగా వుండ గానే మరో గాయం చేశారు ఫిజిక్స్ ప్రొఫెసర్. ఇంక భరించలేకపోయాడు. అందుకే వచ్చేశాడు.

'అన్నయ్య మొదట బాధపడ్డా పరిస్థితి అర్థం చేసుకోలేని తెలివి తక్కువవాడు కాదు. అర్థం చేసుకున్న మరుక్షణం నన్ను క్షమిస్తాడు' అను కుంటూ గంగ వున్న వంట గదివైపు వెళ్ళాడు.

"ఏరా చిన్నన్నయ్యా! యివ్వాళ యింత పెందలాడే వచ్చేశావేంటి? మధ్యాహ్నం క్లాసులు లేవా?" అంది చిన్నగా నవ్వుతూ గంగ.

"ఎందుకులేవు. వున్నాయి. కానీ, యికనుంచీ నా క్లాసులు మరీ అంత చిన్నకాలేజీలో జరగవు. నేను నేర్చుకోబోయే పాఠాలు, విశ్వమనే ఈ విశాల ప్రపంచపు కాలేజీలో నేర్చుకుంటాను మైడియర్ సిస్టర్!" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"అంటే?" అంది అమాయకంగా ముఖం పెడుతూ గంగ.

"అంటే ఏముంది! యికనుంచీ మనం కాలేజ్‌కు వెళ్ళం!"

"అన్నయ్యా!"

"ఏమ్మా! ఏం కొంపలంటుకు పోయాయని అలా కేకలేస్తున్నావు!"

"ఈ విషయం పెద్దన్నయకు తెలుసా?" భయంగా అడిగింది గంగ. "నిక్షేపంగా. యిప్పుడే చెప్పాను. ఆ విషయానికేంగానీ నీకేమైనా సాయం కావాలంటే చెప్పు. ట్వంటీఫోర్ అవర్స్ ఎట్ యువర్ సర్వీస్". "ఛీ! కాలేజీ మానేసి యింట్లో కూర్చుని ఏంచేస్తావన్నయ్యా వంట చేస్తావా?"

"అందుకు ప్రతిఫలం దొరుకుతుందంటే దానికే అభ్యంతరం లేదు కానీ యిక్కడ ప్రతిఫలం దొరకదు కనుక నేనావని యిక్కడ చేయను సిస్టర్! డిగ్నిటీ అఫ్ లేబర్ తెలిసినవాణ్ణి, ఏపని చేసినా తప్పులేదు."



ముఖాన మొటిమల మచ్చలు, పొడలు వుంటే, కొంచెం పొదినా ఆకులు మెత్తగా నూరి, రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసి, ఉదయాన్నే శుభ్రంగా కడిగి వేయాలి. ఇలా వారం రోజులు చేస్తే చాలు, మచ్చలు మాయం అవుతాయి.

—సి. సౌదామిని

"అంటే వేరెవ్వరింట్లోనన్నా వంటకు కుదురు తావా?" అని కోపంగా అడుగుతున్న గంగ గడ్డం పట్టుకుని నవ్వుతూ—

"ఎందుకమ్మా అంతకోపం! తప్పేముందీ నలభీమపాకం అని పేరు వినలేదూ?" అన్నాడు విసురుగా లేచిన గంగ చేయిపట్టుకొని ఆపుతూ.

"ఇంక చాల్లేమ్మా మరీ అంత కోపమైతే ఎలా? అయినా ప్రపంచంలో నేను చేయదగ్గ పనులు ఎన్నో వుండగా వంటపని ఎందుకు చేస్తాను?" అంటూ నవ్వుతున్న శ్రీధర్ వైపు చూస్తూ దిగులుగా అంది—

"నువ్వు చేసినపని నాకు నచ్చలేదురా! అన్నయ్యకు కూడా నచ్చివుండదు. గ్రీష్మకు తెలిస్తే మరీ గోల పెడుతుంది. యింక నాన్న! యిప్పుడీ విషయం వింటే" "నాన్నకు చెప్పవద్దు. ఎవ్వరూ చెప్పవద్దు. అంతంత మాత్రంగావున్న ఆయన ఆరోగ్యం మరింత దెబ్బతినే ప్రమాదముంది. అన్నయ్య ఎలాగూ అలాంటి తెలివి తక్కువ పని చెయ్యడు. నువ్వూ గ్రీష్మాకూడా నోర్లు విప్పకుండా వుంటే మంచిది" అంటూ బ్రతిమిలాడుతున్న చిన్నన్న వైపు జాలిగా చూసి తల వూపింది గంగ.

జరిగిందంతా వివరంగా చెప్పాడు చెల్లెలికి. గంగ కళ్ళవెంట నీళ్ళు కారడం చూసి "ఇందుకే నీకు ఏది చెప్పాలన్నా భయం. నీకు గంగ అని పేరెందుకు పెట్టారో గానీ, ఆ గంగమ్మతల్లి ఎప్పుడూ నీ నెత్తినే వుంటుంది. ఓటి కుండలాగా ఎప్పుడూ బొట్లు బొట్లుగా నీళ్ళు కురుస్తూనే వుంటాయి కళ్ళవెంట" అంటున్న శ్రీధర్ మాటల్లో కోపంకంటే బాధే ఎక్కువ ధ్వనించింది.

"అవునూ అమ్మగారెక్కడ? కాలేజీ మానేసినా, ఫ్రెండ్స్ మట్టుకు వదలనట్లున్నారే: మళ్ళీ ఆ అక్కుపక్షి దగ్గరకే వెళ్ళిందా?" అంటున్న శ్రీధర్ మాటలకు కన్నీరు కురుస్తున్న కళ్ళతోనే నవ్వుతూ "ఒరే అన్నయ్యా! సమీరనెందుకురా అలా పిలుస్తావు పాపం? ఆ అమ్మాయి వింటే ఏమను కుంటుంది? ఇప్పుడు గ్రీష్మ వుండి వుంటే నిన్ను పీకి పాకం పట్టేది" అంటున్న గంగ వైపు చూసి నవ్వుతూ—

"నాకు సమీర అంటే యిష్టం. నేనలా పిలిస్తే సమీరకు కోపమొస్తుందని మీరను కుంటున్నారు. కానీ నిజానికి నేను ప్రేమగా పక్షీ అని పిలిస్తే పులకించి పోతుంది తెలుసా?" అంటున్న శ్రీధర్ మాటలు పూర్తి కాకుండానే వెనగ్గా వచ్చిన గ్రీష్మ చెవి పట్టుకుంది. ప్రక్కనే నవ్వుతూ నుంచున్న సమీరను చూసి శ్రీధర్ సిగ్గుపడి పోయాడు పట్టుబడిన దొంగలా.

"ఏంటన్నయ్యా చెబుతున్నావు మళ్ళీ చెప్పు?" అంటున్న గ్రీష్మ చేతిని లాగేసి గబగబా వీధిలోకి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతున్న శ్రీధర్ వైపే చూస్తూ నుంచున్న సమీర గ్రీష్మ గట్టిగా గిల్లటంతో వులిక్కిపడి తిరిగి చూసింది.

"ఏమిటా చూడటం? మా అన్నయ్యకు దిష్టి తగులుతుంది" అంది నవ్వుతూ.

"అబ్బ! నలకూబరుడు! దిష్టి తగులుతుంది" అంటూ నవ్వుతున్న సమీర భుజాన చేయివేసి "ఏవిటి కథ? నలకూబరుడంటున్నావు వాడేమో ప్రేమగా పక్షీ అని పిలిస్తే పులకించి పోతుందంటున్నాడు, కొంప దీసి లౌ ఎఫైర్ ఏమీ కాదుగదా!" అంటున్న గంగవైపు చూసి నవ్వుతూ "ఆ విషయమేదో మీ అన్నయ్యనే అడగండి నాకు తెలీదు."

"అలాగే అన్నయ్యనే అడిగి తెలుసుకుంటాం గానీ ముందు నువ్వు వచ్చిన పని పెద్దన్నయ్యతో చెబుదాం పద." అంటూ శ్రీహరి గదివైపు అడుగు వేయబోతున్న గ్రీష్మను పిలిచింది గంగ.

"గ్రీషూ! అన్నయ్య బయటికి వెళ్ళినట్టున్నాడు వచ్చేస్తాడులే కూర్చోండి" అంటూ అక్కడే కూర్చోబెట్టి, శ్రీధర్ చేసిన ఘనకార్యం గురించి-అది వినగానే అన్నయ్య బయటకు వెళ్ళిపోవడం గురించీ చెప్పింది. మౌనంగా విన్నది గ్రీష్మ.

[సశేషం]